# గొడుగు



చినుకులు ప్రారంభమయ్యాయి –

అప్పుడే ఆగిన బస్సులోంచి నారాయణమూర్తి దిగాడు

జల్లు మొహంమీద పడింది

కాలనీలోకి వెళ్ళాలి  ఇక్కడ బస్సు ఆగుతుంది కానీ ప్రత్యేకంగా బస్సుస్టాండ్ లాంటిది లేదు

దగ్గర్లో షాపులు కూడా లేవు

పది నిముషాలు నడిస్తే ఇల్లు వస్తుంది

జేబులోంచి రుమాలు తీసి నెత్తిమీద వేసుకొని వేగంగా జాగ్రత్తగా నడక ప్రారంభించాడు –

ఖాన్ కూడా అదే బస్సులోంచి నారాయణమూర్తి వెనకే దిగాడు ఖాన్ యిల్లు కూడా కాలనీలోనే అతనూ రుమాలు తలమీద వేసుకొని నడుస్తున్నాడు–

జార్జి పక్క కాలనీ నుండి వస్తున్నాడు అతని చేతిలో పెద్ద గొడుగుంది జాగ్రత్తగా సర్దుకోగలిగితే ముగ్గురు ఆ గొడుగు క్రింద పడతారు

కాస్త అటు– ఇటులో ముగ్గురూ నడుస్తున్నారు

జార్జికేసి గొడుగు కేసి ఖాన్ నారాయణమూర్తి చూశారు జార్జి యిద్దరికేసి చూశినా చూడనట్టు వూర్కున్నాడు అతని ధోరణిలో అతను

ఎ.వి.వి.యస్.యస్.ప్రసాద్

నడుస్తున్నాడు.

ఖాన్‌ని పిలిస్తే నారాయణమూర్తికి కోపం!

నారాయణమూర్తిని పిలిస్తే ఖాన్‌కి కోపం!

ఇద్దర్నీ పిలిస్తే –

ఖాన్‌కి, నారాయణమూర్తికి ఒకరంటే ఒకరికి పడదు.

మొన్నీ మధ్య కర్ఫ్యూముందు "మసీదు" మీద రాళ్ళు వేసిన వాళ్ళలో నారాయణమూర్తి వున్నాడని ఖాన్ అనుమానం.

హిందువుని చౌరస్తా దగ్గిర చంపడంలో ఖాన్ హస్తం వుందని నారాయణమూర్తికి విపరీతమైన నమ్మకం.

ఒక్క క్షణం పడదు –

ఒకరి కొకరు ఎదురైనప్పుడల్లా "మానవత్వం" భగ్గుమంటుంది.

నారాయణమూర్తి "ఇల్లు" పక్కనే ఖాన్ "ఘర్". "ఖాన్" ఘర్ పక్కనే జార్జి "హౌస్."

ఓ రోజు –

యిద్దరూ (నారాయణమూర్తి, ఖాన్) ఏదో విషయంలో మాటా మాటా వచ్చి కొట్టుకుంటుంటే, మధ్యలో వెళ్ళాడు జార్జి –

అంతే!

యిద్దరు జార్జిని, జార్జి వంశాన్ని, మతాన్ని యిష్టమొచ్చినట్టు తిట్టారు –

తన "మతాన్నే" అవమానించిన వాళ్ళకి,




## "గొడుగు"

గొడుగులో "చోటు" యివ్వడానికి అతని మనస్సు అంగీకరించ లేదు. వాళ్ళు వానలో తడవ వలసిందే!

నారాయణమూర్తికి జార్జిమీద చాలా కోపం వచ్చింది.

వానలో అవతల మనిషి తడుస్తున్నా "కల్చర్" లేదనుకున్నాడు.

ఖాన్ కూడా దాదాపు అదే అనుకున్నాడు.

ముగ్గురూ, మిగిలిన యిద్దర్నీ మనస్సులో తిట్టుకుంటూ కాలనీ చేరారు.

వానమాత్రం అందరి మీద సమానంగా కురిసింది.

వాన ఎడతెరిపి లేకుండా కురుస్తూనే వుంది.

స్కూళ్ళు నుండి పిల్లలు వచ్చే సమయం.

వెళ్ళి పిల్లల్ని తీసుకురావాలి –

జార్జికి మరో అర్జెంటు పని వుండడం వల్ల "జేమ్స్" (జార్జి కొడుకు)ని తీసుకు రావడానికి వెళ్ళదల్చుకోలేదు.

ఖాన్ కూడా వెళ్ళలేదు. ఎందుకంటే ప్రొద్దున్నే వెళ్ళేటప్పుడు "అలీ"కి గొడుగు యిచ్చి పంపాడు–

నారాయణమూర్తి వెళ్దామనుకున్నా వున్న ఒక్క గొడుగు తీసుకొని భార్య ఎక్కడికో వెళ్ళింది.

వాన యింకా కురుస్తూనే వుంది –

అసలే బురద రోడ్లు ఎలా వస్తారో ఏంటో?

ముగ్గురిలోను ఇదే ప్రశ్న!

ఖాన్, నారాయణమూర్తి యిళ్ళ గుమ్మాల్లో నుంచున్నారు పిల్లల కోసం ఎదురు చూస్తూ–

జార్జి బైటికి వస్తుంటే–

దూరంగా –

వాన చినుకుల చాటు నుండి స్పష్టంగా కన్పిస్తోంది ఆ దృశ్యం –

జేమ్స్, అలీ, నారాయణమూర్తి కొడుకు శివరాం ముగ్గురూ అలీ గొడుగులో మెల్లగా నడుచుకుంటూ వస్తున్నారు.

పదేళ్ళు కూడా నిండని ఆ కాన్వెంట్ పిల్లల మొహాల్లో స్వచ్ఛమైన మానవత్వం లాంటి నిర్మలత్వం!

వాన కురుస్తూనే వుంది....! □

